కను'మురుగు'

జగనన్న ప్రభుత్వం వచ్చీ రాగానే పేదల సంక్షేమానికి అలుపు లేకుండా కృషి ప్రారంభించింది. మౌలిక సదుపాయాల కల్పన, జీవన ప్రమాణాల మెరుగు, అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేసింది. పాతనగరంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని కాలువలు, డ్రైనేజీల సమస్యపై దృష్టి సారించింది. కోట్లాది రూపాయల నిధులు కేటాయించి కాలువలు, డ్రైనేజీల నిర్మాణానికి నడుం బిగించింది. ఒక్కో ప్రాంతంలో వీటిని నిర్మిస్తూ మురుగు, చెత్త సమస్యకు చెక్ పెడుతూ రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వన్‌టౌన్ ప్రధాన రహదారిలో జరుగుతున్న కాలువల నిర్మాణం

నాడు

పాతనగరం ఒకప్పుడు పాతనగరంలాగే ఉండేది. ఎక్కడ చూసినా మురుగు, చెత్త కనిపించేది. సరైన కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఈ ప్రాంతమంతా దుర్గంధభరితంగా ఉండేది. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం మాత్రం కాలేదు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాతనగరవాసులకు చెత్త సమస్య దూరమయింది. వివిధ ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీలు నిర్మించడం వల్ల దుర్గంధం మధ్య జీవించాల్సిన బాధ తప్పిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న వచ్చాకే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ముక్తకంఠంతో కొనియాడుతున్నారు.

కాలువలు, డ్రెయిన్ల నిర్మాణంతో వన్‌టౌన్‌కు కొత్తవెలుగులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జగదాంబ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి బాట పడుతున్నాయి. అనేక సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోని కాలువలు, డ్రైన్లు ఆధునికీకరించబడుతున్నాయి. కొత్తగా నిర్మాణాలకు నోచుకుంటున్నాయి. దీంతో నివాస ప్రాంతాల్లో ముందుకెళ్లని మురుగు, చెత్తతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే దురవస్థ తప్పినట్లు అయింది. కొత్త కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల వల్ల పరిసరాలు పరిశుభ్రంగా మారాయి.

పాతనగరానికి కొత్త కళ..

వన్‌టౌన్ ప్రాంతం విస్తరణలో భాగంగా రూ. 5.50 కోట్లతో రహదారికి ఇరువైపుల రెండు కిలోమీటర్ల మేర కాలువలు నిర్మించారు. జగదాంబ నుంచి చూస్తే వన్‌టౌన్ ఏరియా అంతా కనపడాలనే పాతనగర వాసుల కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరింది. రోడ్ల విస్తరణతో పాటు కాలువల నిర్మాణం కూడా జరుగుతోంది. దీంతో పాతనగరం కొత్త కళ సంతరించుకుంటోంది.

- **కల్లుపాకల్లో..** రూ. **17** లక్షలతో కొత్తగా కాలువల నిర్మాణం
- **పండా వీధిలో** రూ. **19** లక్షలతో **215** మీటర్ల మేర కాలువల నిర్మాణం
- **స్ప్రింగ్‌రోడ్డులో** రూ. **2.50** లక్షలతో ఎనిమిది మీటర్ల పొడవైన కల్వర్ట్ నిర్మాణం
- **లక్ష్మీనగర్‌లో** రూ. **5** లక్షలతో **150** మీటర్ల పొడవైన కాలువ నిర్మాణం
- **ఎస్ఎల్ కెనాల్ వద్ద** రూ. **15** లక్షలతో **10** మీటర్ల ప్లాట్‌ఫామ్, ఎనిమిది మీటర్ల ర్యాంప్ నిర్మాణం

కల్లుపాకల్లో కొత్త కాలువలు..



జీవీఎంసీ 35వ వార్డులో కల్లుపాకలు కీలకమైన వీధి. ఇక్కడ సుమారు 15 వందలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ అప్పటి ప్రభుత్వం కాలువ నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలేసింది. ఈ కాలువ ఇప్పుడు శిథిలమై మురుగు నీరు సాఫీగా ప్రవహించక ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు స్వైరవిహారం చేస్తూ స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డు డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ. 17 లక్షలు కేటాయించింది. దీంతో ఇక్కడ నూతన కాలువల నిర్మాణం చేపట్టారు.

ఎస్ఎల్ కెనాల్ మురుగు సమస్యకు చెక్..



ఎస్ఎల్ కెనాల్ కీలకమైన ప్రాంతం. నగర నలుమూలల నుంచి వచ్చే నీరు, చెత్త ఈ కెనాల్ నుంచే సముద్రంలో కలుస్తుంటుంది. వర్షాలు పడిన ప్రతిసారి చెత్త కారణంగా నీరు కెనాల్ పరిమితులు దాటి బయటికి చొచ్చుకొచ్చి రహదారులపై ప్రవహిస్తుంటుంది. సమీపంలోని ఇళ్లలోకి కూడా ఆ మురుగు నీరు వెళ్తుంటుంది. స్థానికులు చెత్త, మురుగుతో ఇబ్బంది పడేవారు. ఈ సమస్య గమనించిన అధికారులు రూ. 15 లక్షలు జీవీఎంసీ నిధులు కేటాయించారు. ఈ నిధులతో 8 మీటర్ల పొడవైన ర్యాంప్, 10 మీటర్ల పొడవైన ప్లాట్‌ఫాం నిర్మించారు. దీంతో ర్యాంప్, ప్లాట్‌ఫాం మీదుగా కెనాల్‌లో నిండిపోయే చెత్తను సులువుగా తొలగించే వీలు కలగడంతో చెత్త, మురుగు సమస్య తప్పి స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్ప్రింగ్‌రోడ్డులో ఎనిమిది మీటర్ల కల్వర్ట్ నిర్మాణం



పాతనగరంలో స్ప్రింగ్ రోడ్డు కీలకమైన ప్రాంతం. పూర్ణామార్కెట్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ తాకిడి వల్ల ఇక్కడి కల్వర్టు పూర్తిగా శిథిలమైపోవడంతో వినియోగదారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2.50 లక్షలతో ఇక్కడ ఎనిమిది మీటర్ల పరిమాణంలో కల్వర్టు నిర్మించడంతో ప్రజలు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పండా వీధి ప్రజలు ఖుషీ..



వన్‌టౌన్‌లోని పండా వీధిలో కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 19 లక్షలు కేటాయించింది. సీఎం జగనన్న ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షలు అభివృద్ధికి కేటాయించిన నిధుల నుంచి ఈ మొత్తం వెచ్చించారు. దీంతో పండా వీధిలో 215 మీటర్ల మేర కాలువలు నిర్మించారు. దీంతో స్థానికులు మురుగు బాధలు తొలగాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీనగర్‌లో తీరిన మురుగు నీటి సమస్య..



వన్‌టౌన్ లక్ష్మీనగర్ అత్యంత మురికివాడ. ఇక్కడ వర్షం పడితే నీరు ఇళ్లలోకి చొచ్చుకు వచ్చేస్తుంది. ఆ సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లలేం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ. 5 లక్షలు కేటాయించి లక్ష్మీనగర్‌లో 150 మీటర్ల మేర కాలువలు నిర్మించింది. దీంతో ఇక్కడ మురుగు నీటి సమస్య పరిష్కారమై స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కాలువలు నిర్మించి సమస్య పరిష్కరించారు..



మా ప్రాంతంలో కాలువలు బాగులేక దుర్గంధంతో ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి కాలవలు నిర్మించి మా సమస్య పరిష్కరించింది. జగనన్నకు ధన్యవాదాలు.

– కాంతం, లక్ష్మీనగర్ నివాసి

సమస్య తీరింది..



కల్లుపాకల్లో ఎప్పుడో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలువలు శిథిలమై మురుగు, చెత్త, దుర్గంధంతో బాధపడేవాళ్లం. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలువల అభివృద్ధి జరగక బాధలు పడుతూనే ఉన్నాం. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి కాలువలు నిర్మించడంతో మా ప్రాంతంలో మురుగు, కాలువల సమస్య తీరింది.

–రాజు, కల్లుపాకలు జీవీఎంసీ 35వ వార్డు.

ఇప్పుడు మురుగు సమస్య లేదు..

వైఎస్సార్‌సీపీ పుణ్యమా అని వీధుల్లో కాలువలు బాగుపడ్డాయి. అందరు చేస్తామని చెప్పడమే కాని ఇది వరకు ఏ ఒక్క ప్రభుత్వమూ అభివృద్ధి చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే చెప్పింది చెప్పినట్లు చేసింది. మా ప్రాంతంలో కాలువలు నిర్మించి మురుగు సమస్య పరిష్కరించింది. ఎక్కడికక్కడ కాలువలు నిర్మించడం వల్ల దుర్గంధం బాధ తప్పింది. దోమల సమస్య కూడా లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–బాబి, వ్యాపారి, పూర్ణామార్కెట్

రామకృష్ణానగర్‌లో కొత్త కాలువల నిర్మాణం..

పోర్టుకు దగ్గరగా ఉన్న ప్రాంతం రామకృష్ణానగర్. ఎస్ఎల్ కెనాల్ పొంగినప్పుడు బయటికి వచ్చే మురుగు నీరు ముందుగా ఈ వీధిలోని ఇళ్లలోకే చేరుతుంటుంది. ఈ సమస్య పరిష్కారానికి జీవీఎంసీ రూ. 6 లక్షలతో 80 మీటర్ల పొడవున కాలువలు నిర్మించింది. అప్పటి నుంచి కెనాల్ నుంచి ఒకవేళ మురుగు నీరు బయటికి వచ్చినా కొత్తగా కట్టిన కాలువల ద్వారా మళ్లీ కెనాల్ లోకి వెళ్లిపోతుండడంతో మురుగు సమస్యకు పరిష్కారం దొరికినట్లయింది.

క్లుప్తంగా

గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి



గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరై గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి శరగడం మోహనరావు, కార్యవర్గ సభ్యులు కోరిబిల్లి త్రినాథ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యనిర్వాహకులు ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, ఆదివిష్ణు, కొల్లి సత్యవతి, బొడ్డేటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించబడిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 15 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

'ఉత్తరాంధ్రపై ఎప్పుడైనా సమీక్ష చేశారా?'

మహారాణిపేట: ఉత్తరాంధ్రపై ఏ రోజైనా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేశారా అని తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ ప్రశ్నించారు. నగరంలోని తెలుగుదేశం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ముఖ్యమంత్రి సచివాలయానికి ఎన్ని సార్లు వచ్చారు? ఒక వేళ వస్తే ఏ తేదీల్లో వచ్చారో తెలియజేయాలన్నారు. ఈ ప్రభుత్వ పని తీరు దారుణంగా ఉందని, రోడ్ల దుస్థితి చూసి ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. మంత్రులు ఆలీబాబా నలభై దొంగల ముఠాలా తయ్యారయ్యారని, వీరికి మిలీనియం టవర్స్ కావాల్సి వచ్చిందా అని వ్యంగ్యంగా మాట్లాడారు.

సంక్షేమ బోర్డుతో మోటార్ రంగం బలోపేతం

అల్లిపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మోటారు రంగ కార్మికులు ఏడాదికి పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు జమ చేస్తున్నారని, వాటిలో 1 శాతం సెస్ రూపంలో కేటాయించి మోటారు రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి కార్యదర్శి జె. రాజారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో శనివారం ఉత్తరాంధ్ర ఆటో మోటార్ కార్మికుల హక్కుల సాధనకు ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.బుచ్చిరాజు, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ఏ అచ్యుతరావు, జిల్లా అధ్యక్షుడు మన్మథరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుండా టెండర్లు పిలవడం తగదు

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా టెండర్లు పిలవడం తగదని వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు అన్నారు. వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు పీహెచ్ వర్కర్‌కి పని చేసే సమయంలో కొబ్బరినూనె, సబ్బులు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అటువంటివి ఏమీ లేకుండా టెండర్లు ఎలా పిలుస్తారో తెలపాలన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై కోర్టుని ఆశ్రయిస్తామని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా సొమ్ము మృతుని భార్య దుర్గకు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి వైఎస్సార్ బీమా అండగా నిలిచింది. 34వ వార్డు లక్ష్మీదేవిపేటకు చెందిన కర్రి చిన్నా ఈ నెల 20వ తేదీన కడుపునొప్పితో మరణించాడు. దీంతో అతని భార్య దుర్గకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. త్వరలోనే మిగిలిన సొమ్మును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, పచ్చిరిపల్లి రాము పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్–4 పరిధి 37వ వార్డు పెయిందొరపేట హనుమాన్‌గుడి నేవల్ క్యాంటీన్ వద్ద రూ.49.98 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సామాజిక భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌తో కలిసి మేయర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖ ముందంజలో ఉందని, ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక శాతం నిధులు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే కనీస అవసరాలు తీర్చేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇసుకకొండకు కార్తీక శోభ



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం.. కార్తీక శోభను సంతరించుకుంది. ఇక్కడ ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు పౌర్ణమి పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకోవడమే గాక సామూహిక వ్రతాల్లో పాల్గొంటారు. ఈ మేరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 27వ తేదీ వేకువ జాము నాలుగు గంటలకు ధ్వజస్తంభం పూజ చేస్తారు. ఉదయం 5, 8.30, 10.30 గంటలకు సామూహిక వ్రతాలుంటాయి. ఇందుకోసం రూ.516 పూజా రుసుం చెల్లించాలి. భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించడం లేదని ఈవో తెలిపారు. ఇదిలా ఉండగా చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఆలయం మూసివేస్తారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం తెరుస్తారు.

సాహితీ సమోద్ధరణకు విశాలాంధ్ర విశేష కృషి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చలసాని రాఘవేంద్రరావు తదితరులు

మహారాణిపేట : విశాలాంధ్ర సంస్థ 50వ దశకం నుంచి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని దివిశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి తీసుకురావడంలో విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ బుక్ ఫెస్టివల్ పేరుతో నగరంలో ప్రదర్శన నిర్వహించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాలేదని, ఆ లోటును భర్తీ చేయడంలో విశాలాంధ్ర ప్రదర్శన ముందు వరుసలో నిల్చుందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి. మనోహర్‌నాయుడు, రచయిత ఆచార్య సూర్యారావు, ఆచార్య సిమ్మన్న, హిమాన్సు బుక్ డిపో ప్రసాద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిరి వినాయక దేవాలయ వార్షికోత్సవం

అల్లిపురం : నేరేళ్లకోనేరులో వెలసిన సిరి వినాయక దేవాలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. నియోజకవర్గం నాయకులు సీతంరాజు సుధాకర్ పాల్గొని సిరి వినాయకునికి పూజలు చేసి అన్నసమారాధనను ప్రారంభించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



పెద్దకర్మ కోసం వెంకట్రావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం పలువురికి ఆర్థిక సాయం చేశారు. 33వ వార్డు హరిజన వీధికి చెందిన పట్నాల శ్రీనివాస్ మధుమేహంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా అతనికి మందుల కొనుగోలుకు రూ.5 వేలు, 32వ వార్డు చెరువుగట్టుకు చెందిన బండి రామలక్ష్మి చనిపోయి, తండ్రి జైలులో ఉన్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి పిల్లల చదువుకు రూ.5 వేలు అందజేశారు. గోకుల్ థియేటర్ వెనుక గల ఆకుల విజయకుమార్ కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు, 34వ వార్డు భూపేష్‌నగర్‌కు చెందిన గేదెల ఆదినారాయణ పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, అదే వార్డు జెండా చెట్టు వీధికి చెందిన బొడ్డు ఈశ్వరమ్మ ఇటీవల జరిగిన ప్రమాదం కారణంగా కాలు విరిగిపోయి బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, 36వ వార్డు గన్నేరు వీధికి చెందిన పాట్నూరు వెంకట్రావు ప్రమాదంలో మరణించడంతో పెద్ద కర్మ కోసం అతని కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. 36వ వార్డు పంజా జంక్షన్‌కు చెందిన బండి సింహాచలం ప్రమాదం జరిగిన నేపథ్యంలో మంచాన పడడంతో మందుల కొనుగోలుకు రూ.5 వేలు, 37వ వార్డు చెంగల్రావుపేట కొత్త అగ్రహారానికి చెందిన దాసరి భాస్కరరావు పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం

సీతమ్మధార : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉదయం 7 గంటల నుంచి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగరాజు, ఎస్. శ్రీను అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి, వేగం వద్దు ప్రాణం ముద్దు అని నినాదాలు చేస్తూ రామా టాకీస్ కూడలి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవన్, కిరణశేఖర్, బన్ను, విద్యార్థులు పాల్గొన్నారు.